

మంగళవారం యూనివర్సిటీలో సమావేశమైన యాజమాన్యాల సంఘాల నాయకులు

# డిగ్రీ పరీక్షలకు ససేమిరా!?

- ఈ నెల 14వ తేదీ నుంచి ఎస్‌యూ పరిధిలో ఎగ్జామ్స్
- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చేదాకా నిర్వహించేది లేదంటున్న కళాశాలల యాజమాన్యాలు
- ఆందోళనలో విద్యార్థులు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మే 7 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని శాతవాహన యూనివర్సిటీ ఆధీనంలో ఉన్న డిగ్రీ కళాశాలల్లో రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలుపగా, కళాశాలల యాజమాన్యాలు మాత్రం ససేమిరా అంటున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదలయ్యే వరకు పరీక్షలు నిర్వహించేది లేదని గతంలో శాతవాహన ప్రైవేట్ డిగ్రీ మేనేజ్మెంట్ అసోసియేషన్ (సుప్మా) నాయకులు వీసీకి వినతి పత్రం అందజేశారు. ఈ విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీలు ఒకే తాటిపైకి వచ్చి కొన్ని వాయిదాల తర్వాత డిగ్రీ పరీక్షల నిర్వహణ ఈ నెల 14 నుంచి ప్రారంభించాలని నిర్ణయించాయి. ఈ విషయంలో యాజమాన్యాలపై విద్యార్థులతో ఒత్తిడి తెప్పించి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి, పోలీసుల పహారా మధ్య అయినా పరీక్షలు రాసేలా చేస్తామంటూ చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది.

### తగ్గేది లేదంటున్న యాజమాన్యాలు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం దాదాపు రెండేళ్లుగా డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘాలు ప్రభుత్వానికి విన్నవిస్తున్నాయి. బకాయిలు విడుదల కాకపోవడంతో తాము అప్పులు తీసుకువచ్చి మరీ కళాశాలల నిర్వహణ చేపట్టాల్సిన పరిస్థితి ఉన్నదని, అధ్యాపకులకు వేతనాలు, భవనాలకు అద్దెలు, ఇతర నిర్వహణ భారం తట్టుకోలేక పోతున్నామని ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా పట్టించుకునే వారు లేక పోయారు. గతంలో ఈ విషయంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఒక మంత్రి ప్రత్యేక చర్యలతో 10 శాతంలోపు నిధులు విడుదల చేసిన ప్రభుత్వం, ఆ తర్వాత నెలనెలా కొన్ని నిధులు కేటాయిస్తామని యాజమాన్యాల సంఘాలకు హామీ ఇచ్చింది. ఆ మాట ప్రభుత్వం దాటవేయడయంతో యాజమాన్యాలు ప్రస్తుతం తమకు నిధులు విడుదల చేసే వరకు పరీక్షలు నిర్వహించేది లేదంటూ స్పష్టం చేస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించినా యాజమాన్యాలు యూనివర్సిటీకి చెల్లించలేదు. ఇదే విషయంపై శాతవాహన యూనివర్సిటీలో సైతం మంగళవారం యూనిర్సిటీ అధికారులు, శాతవాహన ప్రైవేట్ డిగ్రీ మేనేజ్మెంట్ అసోసియేషన్, మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలో చర్చలు జరిగినా అవి కొలిక్కిరాలేదు.

### ప్రణాళిక రూపొందించాలి



ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ పెట్టడంతో యాజమాన్యాలు పరీక్షలను వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకైనా పరీక్షలు నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు పీజీ ప్రవేశ పరీక్షలు జూన్‌లో ఉంటాయి. అప్పటి వరకు డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు పూర్తికాపోతే విద్యార్థులు చిక్కుల్లో పడతారు. ఈ విషయంపై యూనివర్సిటీలు, యాజమాన్యాలు ఒక్క తాటిపైకి వచ్చి విద్యార్థులకు న్యాయం చేయాలి.

**- కాంపెల్లి అరవింద్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు (కరీంనగర్)**

### ప్రభుత్వం స్పందించాలి



రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలచేయక పోవడంతో డిగ్రీ, ప్రొఫెషనల్ కళాశాలల విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలవుతాయని ఎదురు చూసిన వారికి నిరాశే ఎదురైంది. ఈ విషయంలో ప్రభుత్వం స్పదించకుంటే విద్యార్థులు పరీక్షల్లో వెనుకబడే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి.

**- సిరిశెట్టి రాజేశ్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం (ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు)**

# బర్త్‌డే వేడుకలు వద్దు

- మాజీ మంత్రి , ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, మే 7 : ప్రస్తుతం భారతదేశ సరిహద్దుల్లో టెర్రరిజాన్ని అంతం చేయడానికి ఆపరేషన్ సింధూర్ ద్వారా బుధవారం జరిగిన సైనిక చర్యకు పూర్తిస్థాయిలో బాసటగా నిలవాల్సిన అవసరం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని గురువారం తన బర్త్‌డే వేడుకలకు దూరంగా ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఒక ప్రకటనలో సూచించారు. సైనికుల లక్ష్యసాధనలో భాగంగా వారికి మనో ధైర్యం కల్పించి విజయం చేకూరాలని వేంకటేశ్వర స్వామిని వేడుకుంటున్నానని తెలిపారు. ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు అందరం ప్రభుత్వానికి అండగా నిలవాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులకైనా సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంలో గురువారం తన జన్మదినం పురస్కరించుకొని కరీంనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు ఎలాంటి వేడుకలు నిర్వహించవద్దని, వీలైతే రక్తదాన శిబిరం నిర్వహించి రక్త సేకరణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఆగుతూ.. సాగుతూ..

## నత్తనడకన కరీంనగర్ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం!

- ముందుకు సాగని సమీకృత భవన పనులు
- కాంగ్రెస్ పాలనలో నిధుల విడుదలలో నిర్లక్ష్యం?
- అద్దె బిల్లులు చెల్లించలేక చేతులెత్తేస్తున్న యంత్రాంగం
- అధికారులు, ప్రజలకు ఇబ్బందులు



నూతనంగా నిర్మిస్తున్న కలెక్టరేట్ భవన సముదాయం

**కరీంనగర్ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవన నిర్మాణం ఒకడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్నట్టు సాగుతున్నది. తమ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే కొత్త కలెక్టరేట్‌ను పూర్తి చేసి, అన్ని హంగులతో ప్రజలకు సేవలందించేలా తీర్చిదిద్దుతామంటూ కాంగ్రెస్ నాయకులు ప్రకటించినా.. ఆచరణలో మాత్రం నత్తకే నడకలు నేర్పతున్నది. నిధులు విడుదల చేయడంలోనూ నిర్లక్ష్యం కనిపిస్తుండగా, పాత భవనం శిథిలావస్థకు చేరింది. మరోవైపు ప్రభుత్వ కార్యాలయాలను నగరంలో వేర్వేరు చోట్లకు తరలించగా, ఏ ఆఫీస్ ఎక్కడ ఉన్నదో తెలియని పరిస్థితి ఉన్నది. దీంతో ఆఫీసులకు వచ్చే ప్రజలు నగరం నలువైపులా తిరగలేక ఇబ్బంది పడాల్సి వస్తున్నది.**

కరీంనగర్ కలెక్టరేట్, మే 7 : కొత్త జిల్లాలతోపాటు కరీంనగర్‌లో కూడా అన్ని హంగులతో సమీకృత కలెక్టరేట్ భవనం నిర్మించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. 2021 చివరి త్రైమాసికంలో ₹51 కోట్ల అంచనాలతో కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఏడాదిలోపే గుత్తేదారు గ్రౌండ్, మొదటి, రెండు అంతస్థుల స్లాబ్ వేసి, గదుల పనులు కూడా పూర్తి చేశారు. అయితే, అనంతర కాలంలో జరిగిన పరిణామాలతో ప్రభుత్వం మారింది. తమ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే కొత్త కలెక్టరేట్‌ను పూర్తి చేసి, అన్ని హంగులతో ప్రజలకు సేవలందించేలా తీర్చిదిద్దుతామంటూ కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ప్రకటించారు. అయితే, భవనం పూర్తి చేయడం అటుంచితే.. నిధులు విడుదలలోనే నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుత్తేదారుకు చెల్లించాల్సిన డబ్బులు పెండింగ్‌లో పడగా, నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో, ప్రభుత్వ కార్యాలయాలు వేర్వేరుచోట్ల ఉండి పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతుండగా, కొత్త కలెక్టరేట్ నిర్మాణంపై కలెక్టర్ పమేలా సత్పతి గతేడాది ఆగస్టులో సంబంధిత గుత్తేదారు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. డిసెంబర్‌లోనూ మరోసారి సమీక్షించి జనవరిలో ప్రారంభించేలా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్త సంవత్సరం మొదలై నాలుగు నెలలు గడుస్తున్నా, నిర్మాణ పనులు మాత్రం ఇంకా కొలిక్కిరాలేదు.

### శిథిలావస్థకు ప్రస్తుత భవనం

ప్రస్తుతమున్న పాత కలెక్టరేట్ భవనం నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించగా, మెయింటనెన్స్ లోపంతో శిథిలావస్థకు చేరింది. పలుచోట్ల పెచ్చులూడుతూ, కార్యాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, అధికారులపై పడుతుండగా గాయాలపాలైన సందర్భాలు కూడా ఉన్నాయి. కంప్యూటర్లు కూడా ధ్వంసం కావడంతో ఉమ్మడి జిల్లాలో అప్పటి కలెక్టర్ స్మితాసబర్వాల్ హయాంలో కెమికల్ కోటింగ్‌తో మరమ్మతులు చేపట్టారు. ఏడాదిపాటు ఎలాంటి సమస్యలేకుండా ఉండగా, అనంతరం యధావిధిగానే వర్షాకాలంలో నీరు కారడం, సిమెంట్ పెచ్చులూడడం మొదలైంది.

### తలలు పట్టుకుంటున్న అధికారులు

మరోవైపు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాల అద్దె చెల్లించలేక అధికార యంత్రాంగం చేతులెత్తేస్తున్నది. దీంతో విధిలేక ఇతరచోట్ల ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి కార్యాలయాలను తరలిస్తున్నారు. అందుకయ్యే ఖర్చు తడిసి మోపెడవుతుండగా, అది కూడా చెల్లించకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారనే చర్చ జరుగుతున్నది. ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణం నేపథ్యంలో పాత కలెక్టరేట్‌లో ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలను నగరంలో వేర్వేరు చోట్లకు తరలించారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి కొన్ని, మరికొన్ని ప్రైవేట్ భవనాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసి నిర్వహిస్తూ వస్తున్నారు. జిల్లా ప్రజలు పలు అవసరాల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు రావాలంటే భయపడే పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఏ ఆఫీస్ ఎక్కడ ఉందో తెలియక ఆగమవుతున్నారు.

### తిరగలేక ప్రజల అవస్థలు

వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారంతా నగరం నలువైపులా తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్ని పనులతో వచ్చినా కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండడంతో, గంట, రెండు గంటల వ్యవధిలోనే పనులు ముగించుకుని, తిరిగి తమ తమ గ్రామాలకు వెళ్లేవారు. ప్రస్తుతం ఒకే పని కోసం గంటల తరబడి కార్యాలయాలు వెతకాల్సి రావడంతో ఒక్కోసారి ఒక్క పని కూడా కావడం లేదని వాపోతున్నారు. సకాలంలో పనులు పూర్తికాక బేజారవుతున్నామని మండిపడుతున్నారు.

### రాష్ట్ర ఆవిర్భావం రోజు ప్రారంభమయ్యేనా?

కనీసం రాష్ట్ర ఆవిర్భావం రోజైనా ప్రారంభించుకునేలా కొత్త కలెక్టరేట్‌ను పూర్తి చేయాలని ఆదేశించినా, పనుల్లో వేగం పెరగడం లేదు. ఇంకా ఫ్లోరింగ్ పనులు సాగుతున్నాయి. ఎలక్ట్రికల్, కలరింగ్ పనులు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. ప్లంబింగ్, సానిటేషన్, విండోస్, డోర్స్, గార్డెనింగ్, కలెక్టరేట్ చుట్టూ రహదారుల నిర్మాణం, ఎలివేషన్‌తోపాటు ఇతర పనులు ఇంకా మొదలే కాలేదు. ఆయా కార్యాలయాల్లో అధికారులు, సిబ్బందికి అవసరమైన ఫర్నీచర్ పనులతోపాటు కలెక్టర్, ఇద్దరు అదనపు కలెక్టర్ల క్యాంపు కార్యాలయాలు, రెండు మీటింగ్ హాళ్ల నిర్మాణం కూడా చేయాల్సి ఉన్నది. ఇవన్నీ ఇప్పట్లో పూర్తవడం అసాధ్యమని ప్రభుత్వ అధికారులే పేర్కొంటుండడం గమనార్హం. అయితే, ముందుగా ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ పనులు పూర్తి చేసి, ఇతరచోట్ల కొనసాగుతున్న కార్యాలయాలు తరలించి, ప్రజల ఇబ్బందులకు పరిష్కార మార్గం చూపాలనే డిమాండ్ అన్ని వర్గాల నుంచి వస్తున్నది. మరో 25 రోజుల్లో ఆ పనులైనా పూర్తి చేసి సమీకృత భవనం ప్రారంభించాలని అటు అధికారులు, ఇటు ప్రజలు కోరుతున్నారు.

# ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేయాలి

- దేశ భద్రతకు ఏ నిర్ణయం తీసుకున్నా బీఆర్‌ఎస్ పూర్తి మద్దతు
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, మే 7 : పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేయాలని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పహల్గాం ఘటన తర్వాత కేంద్రం దేశ భద్రతకు సంబంధించి ఏ నిర్ణయం తీసుకున్నా బీఆర్‌ఎస్ మద్దతు ఇస్తుందని ఇదివరకే ప్రకటించామని, గతంలో సర్జికల్ స్ట్రైక్ కూడా తమ పార్టీ మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. ఆపరేషన్ సింధూర్‌కు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు. దేశ భద్రతే అన్నింటికన్నా ముఖ్యమన్నారు. పాక్ ప్రతిదాడులను కూడా సైన్యం సమర్థవంతంగా తిప్పికొడుతుందనే నమ్మకం ఉందన్నారు. తెలంగాణ ప్రాంతంలో ఒక్క సైనిక్ స్కూల్ కూడా లేదని, ఏపీలో కోరుకొండ, పులివెందుల, కలికిరిలో ఉన్నాయని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సైనిక్ స్కూల్ కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో వరంగల్‌కు సైనిక్ స్కూల్ మంజూరు చేసినా అనేక షరతులు పెట్టారని, రాష్ట్ర ప్రభుత్వమే సైనిక్ స్కూల్‌కు అన్ని ఖర్చులూ భరించాలని చెప్తే కేసీఆర్ నిరసన తెలిపారని చెప్పారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సైనిక్ స్కూల్ గురించి తాను లేఖ రాశానని, దీనిపై తనను హేళన చేస్తూ మాట్లాడారని పేర్కొన్నారు. బొల్లారంలో సైనిక్ స్కూల్ వస్తుందని చెప్పారని, కానీ ఇప్పటి వరకు అతీగతి లేదన్నారు. ఏపీలో ఉన్న సైనిక్ స్కూల్‌లో తెలంగాణ వారికి ఉన్న రిజర్వేషన్ కోటా ఎత్తేశారని, తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్, బీజేపీలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఏపీకి కొత్తగా విజయవాడలో సైనిక్ స్కూల్ మంజూరైందని, తెలంగాణలో ఒక్కటి కూడా లేకపోవడం దుర్మార్గమన్నారు. దీనిపై కోర్టులను ఆశ్రయించే దిశగా చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు.



జాతీయ రహదారిపై రైతులతో కలిసి ధర్నా చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

# తడిసిన ధాన్యం కొనాల్సిందే

- ఎలాంటి షరతులు పెట్టద్దు
- జగిత్యాల తొలి మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల/ జగిత్యాల టౌన్, మే 7 : అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే ప్రభుత్వం కొనాలని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం అర్ధరాత్రి పడిన అకాల వర్షానికి చల్‌గల్ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం తడువగా, బుధవారం ఆమె పరిశీలించారు. ధాన్యం అమ్మేందుకు తెచ్చి నెలల తరబడి నిరీక్షిస్తున్నామని రైతులు ఈ సందర్భంగా గోడు వెల్లబోసుకున్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దీంతో రైతులతో కలిసి వసంత చల్‌గల్ మార్కెట్ ఎదుట ఉన్న నిజామాబాద్ జాతీయ రహరిదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. వర్షం వల్ల వరి రంగు మారినా, మొలకెత్తినా, తేమ శాతంతో సంబంధం లేకుండా, కొర్రీలు పెట్టకుండా ధాన్యం కొనాలని డిమాండ్ చేశారు. హమాలీల కొరతతో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని, వెంటనే హమాలీలను ఏర్పాటు చేసి రైతుల వద్ద కొన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో చల్‌గల్ యార్డులో 20 నుంచి 30 మంది హమాలీలు పనిచేశారని, ప్రస్తుతం 10 మంది కూడా దిక్కులేరన్నారు. కొనుగోళ్లు సరిగా లేకపోవడంతో అకాల వర్షం వల్ల రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. దాదాపు గంటపాటు ధర్నా చేయడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోగా, అదనపు కలెక్టర్ బీఎస్ లత వచ్చారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ ధర్నాలో చల్‌గల్, మోరపల్లి, హస్నాబాద్, జగిత్యాల రూరల్ రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వార్పిన్ కార్మికులు

# కూలి రేట్లు పెంచాలి

- సిరిసిల్ల జిల్లాకేంద్రంలో వార్పిన్ కార్మికుల ధర్నా

రాజన్న సిరిసిల్ల, మే 7 (నమస్తే తెలంగాణ) : కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ వార్పిన్ కార్మికులు రోడ్డెక్కారు. యజమానుల మొండి వైఖరిని నిరసిస్తూ బుధవారం సిరిసిల్ల పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తి దారుల సంఘం కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కూలీ పెంచాలని వారం కిందటే యజమానులకు సీఐటీయూ, వార్పిన్ యూనియన్ నాయకులు నోటీసులు ఇచ్చారు. అయినా స్పందించక పోవడంతో వార్పిన్ యూనిట్లు బంద్‌పెట్టి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా తెలంగాణ వపర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన చీరల ఆర్డర్లు యజమానుల పథకంగా మారిందని విమర్శించారు. వస్త్ర ఉత్పత్తిదారులు పూర్తిగా కార్మికుల వ్యతిరేకిగా మారారని మండిపడ్డారు. బతుకమ్మ చీరల కన్నా ఈప్రభుత్వం ఇచ్చిన చీరలతో పనిభారం రెండింతలు పెరిగిందని, పనికి తగ్గ కూలీ ఇవ్వాలని అడిగినా యజమానులు ముందుకు రావడం లేదన్నారు. కార్మికులు సమ్మె బాట పట్టినా చేనేత జౌళీ శాఖ అధికారుల నిర్లక్ష్యం వీడడం లేదని మండిపడ్డారు. కార్మికుల కూలీని నిర్ణయించాల్సిన అధికారులు యజమానులకు అప్పగించడ వల్ల ఈసమస్య తలెత్తిందని పేర్కొన్నారు. జౌళీశాఖ అధికారులు కార్మికుల సమస్యలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బట్ట ఉత్పత్తి చేసే కార్మికులతో అధికారులు మాట్లాడడానికి సమయం కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ పథకాలు కార్మికుల ప్రయోజనం కోసమా..? యజమానుల లాభం కోసమా..? చెప్పాలని నిలదీశారు. యజమానులు తమ స్వప్రయోజనాల కోసమే తప్ప కార్మికుల శ్రేయస్సుగురించి ఆలోచించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అధికారులు స్పందించకుంటే గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, వైపని యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, ఉడుత రవి, మచ్చవేణు, ఒగ్గు గణేశ్, ఎలికేటి శ్రీనివాస్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, దోమల రమేశ్, చింతకింది సుధన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు

జగిత్యాల రూరల్, మే 7 : జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 12న జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి బీ సత్తమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని కేవల్ గ్రూప్ సంస్థలో పిక్కింగ్, ప్యాకింగ్, సార్టింగ్ ఖాళీల కోసం ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇంగ్లిష్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈనెల 12న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.













